క్లుప్తంగా

నేడు 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే'..

ఐ.పోలవరం: ఐ.పోలవరం గ్రామ పెదమడిలో 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తామని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సర్పంచ్ దంతులూరి రాఘవరాజు అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకూ, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని బుధవారం కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 33–11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా తాళ్లరేవు, మల్లవరం, జార్జీపేట, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలో అన్ని గ్రామాలకు, సీతారామపురం, పెద్దబొడ్డు వెంకటాయపాలెం, చిన్నబొడ్డు వెంకటాయపాలేనికి సరఫరా ఉండదన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వామియే శరణం అయ్యప్ప

మార్మోగిన వీరేశ్వరస్వామి ఆలయం



వీరేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం అయ్యప్పల శరణు ఘోషతో మార్మోగింది. చుట్టుపక్కల గ్రామాల్లో అయ్యప్ప మాల ధరించిన భక్తులు బుధవారం ఆలయ ఆవరణలో గురుస్వామి నడింపల్లి గణపతి మూర్తి, పలువురు గురుస్వాములచే ఇరుముడులు వేసుకున్నారు. సుమారు 100 మంది స్వాములు ఇరుముడులు ధరించి శబరిమలకు ప్రత్యేక బస్సులు, రైళ్లలో బయలు దేరారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు, కుటుంబ సభ్యులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజామునే ఆలయంలో అయ్యప్పలు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు.

సమష్టిగా కార్తిక మహోత్సవాలు



ఆలయంలో సమావేశమైన ఆలయ చైర్మన్ బాబి, సహకార సంఘం చైర్మన్ శ్రీను, పెద్దలు

అమలాపురం టౌన్: స్థానిక చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మహోత్సవాలు సమష్టిగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి, కళా వెంకట్రావు వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ తోట శ్రీను, ఆ ప్రాంత పెద్దలు నిర్ణయించుకున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచనలతో వైఎస్సార్ సీపీ నాయకుడు బాబి, శ్రీను ఈ కార్యక్రమాలు జరుపనున్నారు. దీనికి అన్ని పార్టీలకు చెందిన నాయకులు, భక్తులు సహకరించి కార్తిక పూజలను నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. వీరంతా ఆలయ ప్రాంగణంలో బుధవారం సమావేశమయ్యారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, మాజీ కౌన్సిలర్ దున్నాల, జొన్నాడ బాబి, నల్లా బుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకుడు కల్వకొలను ఉమ తదితరులు సమావేశమై ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహిద్దామని తీర్మానించుకున్నారు.

సభ విజయవంతానికి పిలుపు

ముమ్మిడివరం: గుంటూరు– విజయవాడ రహదారి చెంతన నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఏపీ రజక సంఘాల ఐక్య సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న జరిగే రజక ఆత్మగౌరవ మహాసభ విజయవంతం చేయాలని ఆయినాపురపు వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక తాలూకా రజక సామాజిక భవనం వద్ద వెంకట్రావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శాసన సభ, పార్లమెంట్ స్థానాల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలన్నారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని, ఆంధ్రప్రదేశ్‌లోనూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అన్నారు. కేశనకుర్తి వెంకటేశ్వర్లు, పేట వెంకటేశ్వర్లు, సముద్రాలపాలెపు పేరయ్య, కేశనకుర్తి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

తాళ్లరేవు: కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మధుమేహ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు బుధవారం తెలిపారు. వరల్డ్ డయాబెటిక్ డేను పురస్కరించుకుని మెడికల్ క్యాంపు నిర్వహించి 100 మందికి పరీక్షలు చేశారు. అనంతరం వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రైమరీ స్కూల్ చిన్నారులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటపాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ సువర్ణ జ్యోతి, స్కూల్ హెచ్‌ఎం ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పథకాలకు పునాది

- మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం
- 'ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలంటే'లో వక్తలు



అమలాపురంలో సంక్షేమ పథకాల బోర్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు



అల్లవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక పథకాలకు పునాది పడిందని, అవే పేదల ఇంటికి వెలుగులు తెచ్చాయని అమలాపురం మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని వార్డు సచివాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొని ప్రసంగించారు. జగన్ ప్రభుత్వ సంక్షేమ విజయాలను వివరించారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును వారు తిలకించి ప్రజలకు వివరించారు. పట్టణ గృహ సారథుల కన్వీనర్ ఈతకోట శ్రావణ్ కుమార్, నాయకులు కర్రి రాఘవ, మామిడిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

గున్నేపల్లి అగ్రహారంలో..

అమలాపురం రూరల్: గున్నేపల్లి అగ్రహారంలో సచివాలయ పరిధికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఏఎంసీ చైర్ పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్ గోపాల్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల జానకి లక్ష్మీరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగాబత్తుల కొండ, నాయకులు కేతా సాయిబాబు, నాగాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.



గున్నేపల్లి అగ్రహారంలో ప్రచారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ డోలామణి, ఎంపీపీ తదితరులు

అల్లవరం: అన్నివర్గాల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమైందని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరం–2 సచివాలయ పరిధి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సర్పంచ్ బొమ్మి బాలవేణి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు, గ్రామాభివృద్ధికి కేటాయించిన నిధులను ఎంపీపీ వివరించారు. అనంతరం పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మండలాధ్యక్షుడు బద్రి బాబ్జీ

హామీలు నూరు శాతం అమలు

ఉప్పలగుప్తం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి సచివాలయం–2లో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, ఎంపీటీసీ సభ్యురాలు వరసాల వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దంగేటి దొరబాబు, జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ బడుగు మేరీకుమారి, సచివాలయ కన్వీనర్లు అంగాడి వీరబాబు, బీర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే రావాలని వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్ అన్నారు. జార్జీపేట సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం స్థానిక కోనేరు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, పంచాయతీ కార్యదర్శి వి.వరలక్ష్మి, నాయకులు పెట్ల సూర్యనారాయణ రాజు, శాంతకుమారి, పువ్వల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కాట్రేనికోన: చెయ్యేరు పంచాయతీలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ముందుగా పార్టీ జెండాను జెడ్పీటీసీ నేల కిశోర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అందరికీ విద్య, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకుందామన్నారు. చెయ్యేరు పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన మమ్మురాజు, ముడిదుడ్డి రామారావు తదితరులు ఉన్నారు.

5 నాణేల యాక్రిలిక్ బాక్స్ సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన యాక్రిలిక్ బాక్స్‌లో ఐదు నాణేలు

అమలాపురం టౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని ముంబయి టంకశాల రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 నాణేలను యాక్రిలిక్ బాక్స్‌లో ప్రత్యేకంగా విడుదల చేసింది. దీనిని అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సేకరించారు. చలామణిలో ఉండే ఈ ఐదు నాణేలను తొలిసారిగా యాక్రిలిక్ బాక్స్‌లో విడుదల చేయడం విశేషం. ఈ బాక్స్‌పై గాంధీ మార్చ్ చిత్రం, అశోక చక్రం, జి–20 లోగో, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లోగోలను ముద్రించారు. పరిమితంగా విడుదల చేసిన ఈ నాణేల బాక్స్‌ను కృష్ణకామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు.

బాలయోగీశ్వరుల జన్మదిన వేడుకలు



ముమ్మిడివరంలో బాలయోగీశ్వరుల ఊరేగింపు

ముమ్మిడివరం: స్థానిక భగవాన్ పెద బాలయోగీశ్వరుల 93వ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, స్వామి జ్ఞాన మందిరంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి ఊరేగించారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. అధిక సంఖ్యలో ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి నిధులు

ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: కోస్తా తీరం వెంబడి ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల కారణంగా మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, అందుకే వేటపై ఆధారపడిన వారికి ఆయా పరిశ్రమల నుంచి నష్ట పరిహారం తీసుకు వస్తున్నట్లు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం గాడిమొగ పంచాయతీ పరిధి గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల గ్రామాల్లో నిర్వహించిన మత్స్యకార సదస్సుల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఓఎన్జీసీ నష్ట పరిహారానికి సంబంధించి ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికీ రూ.69 వేల చొప్పున ఈ నెల 21న బ్యాంకు అకౌంట్‌లలో జమ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి ఈ పరిహారాన్ని తీసుకువచ్చామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి ఎన్నో నిధులు కేటాయించారని తెలిపారు. ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ నెల 21న కోరంగిలో నిర్వహించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆయా సమావేశాల్లో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, నాయకులు అంకాడి అంజిబాబు, మాతరాజు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చట్ట వ్యతిరేక చర్యలను ఉపేక్షించం

డీఎస్పీ అంబికా ప్రసాద్ హెచ్చరిక

అమలాపురం టౌన్: అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కార్తిక వన సమారాధనలను సంప్రదాయబద్ధంగా, సంఘీభావంతో జరుపుకోవాలని డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సూచించారు. వన భోజనాల పేరుతో చట్ట వ్యతిరేక చర్యలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వన భోజనాలను మిగతా ప్రాంతాలకు ఆదర్శవంతంగా ఉండేలా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక వర్గాలు, యూనియన్లు, సంఘాల వారీగా జరుపుకొనే ఈ వేడుకల్లో కులాలు, వర్గాలను రెచ్చగొట్టేలా పోస్టర్లు, ఫ్లెక్సీలు, సోషల్ మీడియా పోస్టింగ్‌లు వంటి వాటికి స్వస్తి పలకాలని సూచించారు. అలాగే సామాజిక వర్గ సమావేశాల్లో అవతలి వర్గాల, వ్యక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఉపన్యాసాలు ఉండాలని హితవు పలికారు. కార్తిక వన మహోత్సవాల్లో అశ్లీల నృత్యాలు, జూద క్రీడలను ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని అన్నారు. మోటారు సైకిళ్ల సైలెన్సర్లు తీసివేయడం, పెద్ద శబ్దాలతో నడపడం వంటి చర్యలకు పాల్పడితే తక్షణమే ఆ మోటారు సైకిళ్లను సీజ్ చేస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.



అంబికా ప్రసాద్, డీఎస్పీ

'ఆడుదాం ఆంధ్రా'కు సమాయత్తం కావాలి

అల్లవరం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతానికి పంచాయతీ కార్యదర్శులు సిబ్బందిని సమాయత్తం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ సూచించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 23 సచివాలయాల పరిధిలో కనీసం రెండు టీమ్‌లను అయినా సిద్ధం చేయాలన్నారు. 15 ఏళ్లు పైబడిన వారి పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రాలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ విభాగాల్లో క్రీడలు ఉంటాయన్నారు. ఈ క్రీడల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదన్నారు. ఎంఈఓలు కిరణ్‌బాబు, ఏడుకొండలు, ఏఈ సుబ్బారావు, స్వామి, సంపన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

యాంటీ బయోటిక్స్‌తో అనేక నష్టాలు

తాళ్లరేవు: ఆక్వా కల్చర్‌లో యాంటీబయోటిక్స్ వినియోగంతో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, వాటి నిరోధానికి ప్రభుత్వం యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కార్యక్రమాన్ని రూపొందించిందని నాక్సా సీఈఓ డాక్టర్ టీజీ మనోజ్‌కుమార్ తెలిపారు. ఏఎంఆర్ వీక్‌లో భాగంగా బుధవారం తాళ్లరేవు లయన్స్ క్లబ్ భవనంలో ఎంపెడా నాక్సా ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాన్ని సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి ప్రారంభించారు. దీనికి మనోజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యాంటీబయోటిక్స్ వినియోగంతో అనేక ప్రమాదాలు, నష్టాలు కలుగుతున్నాయన్నారు. వాటిని రైతులకు వివరించేందుకు ఏఎంఆర్ వీక్ ఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా 16 భారీ ప్రచార కార్యక్రమాలు ఏర్పాటు చేయగా 10 కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగనున్నాయని, ప్రథమంగా తాళ్లరేవులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఐఎఫ్ఈ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మురళీధర్ ఆక్వా కల్చర్‌లో యాంటీబయోటిక్స్ వాడకుండా చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులైన బయో సెక్యూరిటీ, నీటి నాణ్యతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నాక్సా జనరల్ కౌన్సిల్ సభ్యుడు జి.వేణుప్రసాద్, ఫిషరీస్ ఏడీ ఎం.లావణ్య, కె.మధుసూదన్‌రెడ్డి, ఎన్పీ చంద్రశేఖర్, మురళీధర్ ఆండే, ఎస్.బాలాజీ, మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాక్సా సీఈఓ మనోజ్‌కుమార్

విజ్ఞానదాయకంగా పుస్తక ప్రదర్శన

అమలాపురం టౌన్: స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో రెండో రోజు బుధవారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన పాఠకులు, విద్యార్థులను ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను అమలాపురం ఎంఈఓ–1 గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈఓ–2 ఎస్.దుర్గాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుస్తకాలు చదవడం అంటే సమస్త లోకాన్ని చదివినట్లేనని చెప్పారు. ఆ మంచి గుణాన్ని అందించే గ్రంథాలయాలు పాఠకులకు విజ్ఞానదాయకమైన సేవలు అందిస్తున్నాయని చెప్పారు. గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వెత్సావారి అగ్రహారం మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీఆర్ కామేశ్వరరావు, తెలుగు పండితుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.



అమలాపురంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంఈఓలు సూర్యప్రకాశం, దుర్గాదేవి

అభివృద్ధి పనుల ప్రారంభం

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంపై రూ.25 లక్షలతో నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభించారు. రూ.7.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి ఎమ్మెల్యే పొన్నాడ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీలో రహదారులు నిర్మించాలని, తాగునీటిని పూర్తిస్థాయిలో అందించాలని పలువురు మహిళలు కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, గ్రామ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీడీఓ ఎం.అనుపమ, పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ, నాయకులు కామాడి మాతరాజు, లోకేష్, గంజా కాశీ విశ్వనాథ్, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.



గాడిమొగ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక



చొల్లంగిపేటలో ఎంపికైన క్రీడాకారులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చొల్లంగిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్ టెన్నిస్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. దీనికి జిల్లా నుంచి 50 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరయ్యారు. జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యనిర్వాహణ అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబు, నీలిమ నేతృత్వంలో ఈ ఎంపికలు జరిగాయి. ఇందులో బాలుర విభాగం నుంచి లిఖీష్, సన్నీ, వెంకట సందీప్, నందు, పవన్‌కుమార్, ప్రసాద్, శ్రీదత్త శివరాజేష్, ఆదిత్య, శ్రీకాంత్, బాలికల విభాగం నుంచి యువరాణి, హేమశ్రీ, దివ్యజ్యోతి, కీర్తి, సత్యవర లక్ష్మి ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నీలిమ తెలిపారు. సాయిబాబు మాట్లాడుతూ జిల్లాలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కె.కరుణ, ధనలక్ష్మి, కుమారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై మంత్రికి వినతి



మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

అమలాపురం రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సభ్యులు వినతిపత్రం అందించారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఈఓ 117ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు బుధవారం భట్నవిల్లిలో మంత్రిని సంఘ జిల్లా అధ్యక్షుడు పి.విష్ణు, ప్రధాన కార్యదర్శి పి.నరేష్‌బాబు, జిల్లా బాధ్యుడు లక్ష్మీ గోపాలకృష్ణ కలిశారు.

వెండి పళ్లెం సమర్పణ



భువనేశ్వరి అమ్మవారికి వెండి పళ్లెం సమర్పిస్తున్న ప్రసాద్ కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: పాత బండారులంకలో భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరీ అమ్మవారికి సుమారు రూ.30 వేల విలువైన వెండి పళ్లెంను బుధవారం ప్రసాద్ ట్రేడర్స్ అధినేత గుమ్మడి ప్రసాద్ సమర్పించారు. శ్రీశైలం దేవస్థానం మాజీ సభ్యుడు చింతా శంకర మూర్తి, చింతా అత్తిలింగం, గోళ్ల మల్లేశ్వరరావు, పురోహితుడు సద్గురు సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా...

డీఏ పెంచుతూ ఉత్తర్వుల జారీ

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో పనిచేస్తున్న ఫుల్‌టైమ్ క్యాజివల్ లేబరర్స్‌కు డీఏ పెంచుతూ బుధవారం ఆర్థిక శాఖ కార్యదర్శి అర్జున్ రామకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. 7వ సెంట్రల్ పే కమిషన్ నిర్ణయించిన జీతాల ఆధారంగా ఇప్పటికే రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 42 శాతం నుంచి 46 శాతం మేరకు పెంచినట్లు, ఈ నిర్ణయం జూలై 1 నుంచి అమలులోకి వస్తుందన్నారు. కేటగిరి–1, 2, 3 వారికి రోజుకు రూ.852 నుంచి రూ.876కు, కేటగిరీ–4కు రూ.942 నుంచి రూ.968కు, కేటగిరీ–5 వారికి రూ.1,207 నుంచి రూ.1241కు, కేటగిరీ–6 వారికి రూ.1,382 నుంచి రూ.1,421కు డీఏ పెంచారు.

అర్హులకు న్యాయం చేయండి

యానాం: నాలుగేళ్ల నుంచి యానాంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో పలువురు ఓఎన్జీసీ నష్ట పరిహారానికి అర్హులు కాలేకపోయారని బుధవారం స్థానిక మత్స్యకార నాయకుడు అరదాడి పోసియ్య అన్నారు. కొత్తగా పెళ్లయినవారి పేర్లు తల్లిదండ్రుల రేషన్‌కార్డులో ఉండిపోవడంతో పరిహారం అందడం లేదన్నారు. రెండో విడత అర్హుల జాబితాలో 918 మంది మత్స్యకారుల పేర్లు చేర్చారని, అయితే పరిహారం పొందాలంటే 2023 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండాలని చేర్చడంతో చాలామంది నష్టపోయారన్నారు. తక్షణం అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

ఓఎన్జీసీ పరిహార జాబితా విడుదల

యానాం: యానాం నియోజకవర్గ మత్స్యకారులకు ఓఎన్జీసీ మంజూరు చేసిన వేట నష్ట పరిహారానికి సంబంధించి అర్హుల జాబితాను గవర్నమెంట్, తాలూకా వెబ్‌సైట్లలో, ఆర్ఏఓ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ఇందులో తమ పేర్లను లబ్ధిదారులు పరిశీలించుకోవాలని బుధవారం మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్ఏఓ ఆదేశాల మేరకు ఓఎన్జీసీ నష్ట పరిహారానికి విలేజ్ లెవిల్ కమిటీ ఎంక్వయిరీ చేసినట్లు, ఆ విధంగా 2,138 మంది అనర్హులుగా పేర్కొన్నారన్నారు. వీరిలో 1,402 మంది అభ్యంతరాలు తెలిపారన్నారు. ఆ పేర్లను మళ్లీ పరిశీలించగా 918 అర్హులైన వారు పేర్ల జాబితాను ఈ నెల 14 నుంచి 18 వరకూ పరిశీలించుకోవడానికి యానాం వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 18లోగా మత్స్యశాఖ ఏడీ కార్యాలయంలో తెలపాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ముమ్మిడివరం: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోనసీమ జిల్లా సంఘ అధ్యక్షుడు జేఎస్ఎస్ గోపాలకృష్ణ కోరారు. స్థానిక ఎయిమ్స్ కళాశాలలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో పెన్షనర్ సంఘాలతో బుధవారం సమన్వయ సమావేశం జరిగింది. జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రతి నెలా 1న పెన్షన్ జమ చేయాలని, బకాయిలు ఉన్న డీఆర్, పీఆర్సీ ఏక మొత్తంలో చెల్లించాలన్నారు. ఈ మేరకు జిల్లా ట్రెజరీ అధికారి రామానుజంకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, డి.గోపాలకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సత్కారం

యానాం: ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్యాధికారిగా ఉద్యోగం సాధించిన పెద్దిరెడ్డి రేణుకశ్రీసాయిని బుధవారం స్థానిక నారాయణ స్కూల్ యాజమాన్యం సత్కరించింది. పాఠశాలలో చదువుకుని అదే పాఠశాలలో మెడికల్ సర్టిఫికెట్ ధ్రువీకరించడానికి మెడికల్ ఆఫీసర్ హోదాలో వచ్చిన రేణుకను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఏజీఎం శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ బలరామ్‌మహంతి, కోఆర్డినేటర్ సుంకరమూర్తి, తులసి, ప్రియ, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోటు దగ్ధం



యానాం: నియోజకవర్గ శివారు సావిత్రినగర్‌కు చెందిన కామాడి భైరవస్వామి బోటును గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీని విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని, ఎవరో బోటును దగ్ధం చేశారంటూ బాధితుడు బుధవారం సావిత్రినగర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సావిత్రినగర్ జెట్టీ వద్ద ఉంచిన బోటును మంగళవారం అర్ధరాత్రి సముద్రంలో దూరంగా తీసుకువెళ్లి దగ్ధం చేశారని, తనకు న్యాయం చేయాలని పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.